క్లుప్తంగా

విద్యుత్ సబ్‌స్టేషన్లకు కొత్త ఫోన్ నంబర్లు

వేముల : మండలంలోని విద్యుత్ సబ్‌స్టేషన్లకు కొత్త సెల్‌ఫోన్ నంబర్లు ఇవ్వడం జరిగిందని సబ్ ఇంజనీర్ రమేష్ రైతులకు సూచించారు. గతంలో విద్యుత్ సబ్‌స్టేషన్లలో బీఎస్ఎన్ఎల్ నెంబర్లు ఉండేవని.. సిగ్నల్స్ సరిగా లేక రైతులకు విద్యుత్ సమాచారం అందడంలేదనే ఉద్దేశ్యంతో ఎయిర్‌టెల్ నెంబర్లు విద్యుత్ సబ్‌స్టేషన్లకు ఇచ్చారన్నారు. వేముల సబ్‌స్టేషన్‌కు 8712625903, నల్లచెరువుపల్లె సబ్‌స్టేషన్‌కు 8712625904, పెర్నపాడు విద్యుత్ సబ్‌స్టేషన్‌కు 8712625902, వి.కొత్తపల్లె సబ్‌స్టేషన్‌కు 8712625901 ఫోన్ నెంబర్లు ఇచ్చారని.. రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లల సంఖ్య పెంచడమే లక్ష్యం

వేముల : గ్రామీణ ప్రాంతాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లల సంఖ్య పెంచడమే జనభాగిదారి ముఖ్య ఉద్దేశ్యమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ హసీనా తెలిపారు. గురువారం మండలంలోని వేల్పుల అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లల తల్లిదండ్రులకు జనభాగిదారి కార్యక్రమంపై అవగాహన సదస్సు నిర్వహించి మాట్లాడారు. ప్రతి పిల్లవాడు అంగన్‌వాడీ కేంద్రంలో ఉండాలన్నారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు నిర్మల, రామతులశమ్మ, తదితరులు పాల్గొన్నారు.

రేపు మండల సర్వసభ్య సమావేశం

పులివెందుల రూరల్ : పట్టణంలోని స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సభా భవనంలో ఈనెల 17వ తేదీ శనివారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ వెంకటేష్ తెలిపారు. తాగునీరు, పారిశుధ్యం, విద్య, వైద్యం, ఆరోగ్యం, వ్యవసాయం, ఉద్యాన శాఖ తదితర వాటిపై చర్చ ఉంటుందన్నారు. అన్ని శాఖల అధికారులు తప్పకుండా హాజరు కావాలని ఆయన కోరారు.

రక్తదానంతో ప్రాణదాతలు అవుతారు



రక్తదానం చేస్తున్న దాల్మియా కర్మాగారం సిబ్బంది

జమ్మలమడుగు రూరల్ (మైలవరం) : రక్తదానంతో ప్రాణదాతలవుతారని ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ రఫీక్ పాషా తెలిపారు. గురువారం మైలవరం మండలంలోని దాల్మియా సిమెంట్ కర్మాగారంలో ప్రపంచ రక్తదాన దినోత్సవం సందర్భంగా యజామాన్యం నిర్వహించిన రక్తదాన శిబిరంలో 68 మంది రక్తదానం చేశారు. కార్యక్రమంలో దాల్మియా హెడ్ ముఖేష్‌కుమార్ సిన్హా, డాక్టర్ సాయికిరణ్ ఉమేష్, రామచందర్‌రావు, పీఆర్ఓ బీవీజే కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

కమలాపురం : స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సభా భవనంలో శుక్రవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ చలపతి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సర్పంచులు, ఎంపీటీసీలు, జడ్పీటీసీ, కోఆప్షన్ సభ్యులు హాజరు కావాలని ఆయన తెలిపారు. అలాగే అన్ని శాఖల అధికారులు తమ శాఖ ప్రగతి నివేదికలతో సమావేశానికి హాజరు కావాలన్నారు.

వేతనంతో కూడిన మెడికల్ సెలవులు కల్పించాలి

పులివెందుల రూరల్ : వేతనంతో కూడిన మెడికల్ సెలవుల సౌకర్యం కల్పించాలని, సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యుటీ ఇవ్వాలని, సర్వీస్‌లో ఉండి చనిపోయిన అంగన్‌వాడీ వర్కర్లకు కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించాలని పులివెందుల ఐసీడీఎస్ అధికారిణి శ్రీలతకు సీఐటీయూ నాయకురాలు గురువారం స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్రీలతకు వారు వినతిపత్రం అందించారు. వివిధ మండలాల సీఐటీయూ అంగన్‌వాడీ నాయకురాళ్లు పాల్గొన్నారు.

తహసీల్దార్‌గా పదోన్నతి

ఎర్రగుంట్ల : మండలం డిప్యూటీ తహసీల్దార్‌గా పనిచేస్తున్న డీటీ లక్ష్మీదేవి పదోన్నతిపై తహసీల్దార్‌గా సిద్దవటంకు బదిలీ అయ్యారు. ఎర్రగుంట్ల మండలంలో డీటీగా పనిచేసి మండల ప్రజల మన్ననలు పొందారన్నారు.

ఫీజుల దోపిడీని అరికట్టాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్ : ప్రైవేట్, కార్పొరేట్ విద్యా సంస్థల్లో ఫీజుల దోపిడీని అరికట్టాలని ఏఐఎస్ఎఫ్ నగర కార్యదర్శి శివ శంకర్ పేర్కొన్నారు. గురువారం నగరంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏఐఎస్ఎఫ్ కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రైవేట్ విద్యా సంస్థలు విద్యాశాఖ నిబంధనలను తుంగలో తొక్కి సీబీఎస్ఈ, ఒలింపియాడ్ ఈ–టెక్నో వంటి నిషేధిత పేర్లతో విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి రూ.లక్షలు వసూలు చేస్తున్నారని తెలిపారు. పుస్తకాలు, యూనిఫామ్ అంటూ ఫీజుల రూపంలో భారీగా వసూలు చేస్తున్నారని ఆరోపించారు. ప్రైవేట్, కార్పొరేట్ యాజమాన్యాలు విద్యాలయాలను కేవలం వ్యాపార సముదాయాలుగా చూస్తున్నారే తప్ప విద్యా కేంద్రాలుగా చూడటం లేదన్నారు.

విద్యా వ్యవస్థపై స్పెషల్ ఫోకస్ పెట్టిన సీఎం

ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి



ఇంటర్ విద్యార్థి హేమంత్‌కుమార్‌కు నగదు అందజేస్తున్న ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి

కమలాపురం : జగనన్న సీఎంగా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి విద్యా వ్యవస్థపై స్పెషల్ ఫోకస్ పెట్టారని, ఈ నాలుగేళ్లలో కేవలం విద్యా వ్యవస్థపై రూ.62 వేల కోట్లు ఖర్చు చేశారని ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. గురువారం స్థానిక జడ్పీ గర్ల్స్ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన జగనన్న ఆణిముత్యాలు సత్కార సభకు ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లలకు చదువులే ఆస్తులని నమ్మిన ఏకైక సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అన్నారు. అందుకు తగ్గట్టుగా ఆయన విద్యా వ్యవస్థపై స్పెషల్ ఫోకస్ పెట్టారన్నారు. 3వ తరగతి నుంచే సబ్జెక్ట్ టీచర్లను నియమించారని, ఇది కూడా చరిత్రాత్మకమే అన్నా రు. ఈ ఏడాది పదవ తరగతిలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థి స్టేట్ టాపర్‌గా నిలవడం చూస్తుంటే ఇక ప్రైవేట్ పాఠశాలలు దిగదుడుపే అన్నారు.

పదవ తరగతి ఫలితాల్లో జిల్లాలో వీఎన్‌పల్లె, కమలాపురం ప్రథమ, ద్వితీయ స్థానంలో హర్షణీయం అని, అందుకు కారణమైన రెండు మండలాల ఎంఈఓగా పని చేస్తున్న జాఫర్ సాదిక్‌ను అభినందించారు. ఈ ఏడాది నుంచి జగనన్న ప్రభుత్వం నియోజకవర్గ స్థాయిలో టెన్త్, ఇంటర్ కోర్సుల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు రూ.15వేల నగదుతో ప్రోత్సహించే జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమాన్ని ప్రారంభించడం గర్వకారణం అన్నా రు. కాగా టెన్త్‌లో షేక్ హాఫిజున్ (578 నందిమండం), సయ్యద్ అన్వర్ హుసేని (576 చెన్నూరు), టి.ధనుంజయ(565 కమలాపురం)లతో పాటు ఇంటర్‌లో ఆవుల హేమంత్ కుమార్ (894 గవర్నమెంట్ కాలేజీ), బి.సాయిలత (912మోడల్ స్కూల్), ఎల్. విష్ణు ప్రియ (895 సోషల్ వెల్ఫేర్) లకు రూ.15వేల నగదుతో పాటు మెడల్, ప్రశంసా పత్రాలతో సత్కరించారు. విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులను కలిపి సన్మానించడం విశేషం. కమలాపురం, చెన్నూరు మండలాల మండల స్పెషలాఫీసర్లు నరసింహారెడ్డి, వెంకట సుబ్బయ్య, ఎంఈఓలు జాఫర్ సాదిక్, వెంకట్రామిరెడ్డి, సుజాత, లిల్లెమ్మ తదితరులు మాట్లాడారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

చుక్కల భూముల సమస్యను పరిష్కరించడం హర్షణీయం

ఎన్నో ఏళ్లుగా అపరిష్కృతంగా ఉన్న చుక్కల భూముల సమస్యలను సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఒక్క సంతకంతో పరిష్కరించడం హర్షణీయం అని ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. గురువారం కమలాపురం–3వ వార్డు సచివాలయంలో తహసీల్దార్ అలీఖాన్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో చుక్కల భూములున్న 17 మంది బాధితులకు పట్టాను ఆయన అందజేసి మాట్లాడారు. చంద్రబాబు 2016లో చుక్కల భూములు రిజిష్టర్ చేయవద్దని 22(ఎ) లిస్ట్‌లో పెట్టి రైతులను ఇబ్బందులకు గురి చేశారన్నారు. దానికి సీఎం జగనన్న పరిష్కరించారన్నారు. ఒక్క పెండ్లిమర్రిలోనే దాదాపు 3600 మంది రైతులకు జిరాయితీ పట్టాలు ఇచ్చామని, ఇలా రాష్ట్ర వ్యాప్తంగా లక్షల మంది ఉన్నారని, ప్రతి రైతు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు ఉత్తమారెడ్డి, రాజుపాళెం సుబ్బారెడ్డి, ఎన్సీ పుల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చుక్కల భూములకు పట్టాలు పంపిణీ



చుక్కల భూముల పత్రాలను అందిస్తున్న వైఎస్ అభిషేక్‌రెడ్డి, తదితరులు

లింగాల : స్థానిక స్త్రీశక్తి భవన్‌లో గురువారం చుక్కల భూముల రైతులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంతకాలతో కూడిన పత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ డాక్టర్స్ విభాగపు రాష్ట్ర కార్యదర్శి వైఎస్ అభిషేక్‌రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చొరవతో చుక్కల భూముల చిక్కులు విడిపోయాయన్నారు. ప్రస్తుతం 311 మంది రైతులకు సంబంధించి 608 ఎకరాలకు చుక్కల భూములకు పట్టాలు పంపిణీ చేశామన్నారు. మిగిలి ఉన్న రైతులకు చుక్కల భూముల సమస్యలను పరిష్కరిస్తారన్నారు. తహసీల్దార్ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ చుక్కల భూముల రైతులు దరఖాస్తులు చేసుకోవాలని.. వాటిని పూర్తిస్థాయిలో విచారణ చేసి ప్రభుత్వానికి నివేదికలు పంపి వాటి సమస్యలను పరిష్కరిస్తామన్నారు. ఎంపీపీ అమృత మాట్లాడుతూ భూ సమస్యలను శాశ్వతంగా పరిష్కరించేందుకు సమగ్ర భూ సర్వే నిర్వహించడం జరుగుతోందన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ పి.వి.సుబ్బారెడ్డి, జెడ్పీటీసీ పుష్ప, మండల వ్యవసాయ సలహా కమిటీ చైర్మన్ కర్మా రమేష్‌కుమార్‌రెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ త్రిభువన్‌రెడ్డి, వీఆర్‌ఓలు, మండలంలోని వైఎస్సార్‌సీపీ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

విద్యకు అధిక ప్రాధాన్యత



విద్యార్థినికి నగదును అందిస్తున్న ఎంఈఓ

జమ్మలమడుగు : రాష్ట్ర ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తోందని ఎంఈఓ క్రిష్టఫర్, బాలుర జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ శ్రీనివాసులరెడ్డిలు తెలిపారు. గురువారం స్థానిక బాలుర జూనియర్ కాలేజీలో జగనన్న ఆణిముత్యాలకు ఎంపికైన విద్యార్థులకు, తల్లిదండ్రులకు సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించి మాట్లాడారు. ఈ ఏడాది పరీక్షల్లో మంచి ఫలితాలను సాధించడంతోపాటు రాష్ట్రస్థాయి ర్యాంకులను సాధించామని సూచించారు. రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ సభ్యురాలు లక్ష్మీదేవి మాట్లాడుతూ బాలికలు బాగా చదువుకుంటేనే వారికి భవిష్యత్తు ఉంటుందన్నారు. మొదటి స్థానంలో నిలచిన వారికి రూ.15 వేలు, రెండోస్థానం రూ.10వేలు, మూడోస్థానంలో నిలిచిన వారికి రూ.5 వేల నగదును అందించారు. కార్యక్రమంలో తహసీల్దార్ వేణుగోపాల్, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

బడిలోనే బడిఈడు పిల్లలుండాలి



ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ వర్కర్లు

కమలాపురం : బడిఈడు పిల్లలు బడిలోనే ఉండాలని కమలాపురం 1వ వార్డు సచివాలయం ఎంఎస్‌కే పద్మజ తెలిపారు. గురువారం జనభాగి కార్యక్రమంలో భాగంగా 1వ సచివాలయం పరిధిలోని కొలిమి వీధి అంగన్‌వాడీ సెంటర్ నుంచి సచివాలయం వరకు వర్కర్లు, తల్లులు, ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో బడిలో పిల్లలు–పనిలో పెద్దలు, చిట్టిచేతిలో పలకాబలపం–పెద్దవారి చేతిలో పలుగుపారా, చిన్నారులు బడిలో ఉంటే మోదం–పనిలో ఉంటే ప్రమాదం అని నినాదాలు చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్లు జ్యోతి, రాణి, గౌసియా, వైష్ణవి, ఎలిజిబెత్ రాణి, లక్ష్మీదేవి, కిరణ్‌కుమారి తల్లులు పాల్గొన్నారు.

ప్రైవేట్ పాఠశాలల్లో

విద్యా హక్కు చట్టం అమలు చేయాలి



సీఆర్పీ ప్రకాష్‌రెడ్డికి వినతిపత్రం అందిస్తున్న బీజేపీ నాయకులు

వేంపల్లె : ప్రైవేట్ పాఠశాలల్లో విద్యా హక్కు చట్టం అమలు చేయాలని బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గాలి హరిప్రసాద్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో ఉన్న సీఆర్పీ ప్రకాష్‌రెడ్డిని కలిసి ఆయన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రైవేట్ పాఠశాలల్లో విద్యా హక్కు చట్టం అమలు చేయడంవల్ల 25 శాతం సీట్లు ఇవ్వడంవల్ల పేద, బడుగు, బలహీన వర్గాలకు మేలు జరుగుతుందన్నారు. పేద విద్యార్థుల ప్రాథమిక హక్కు అయిన విద్యకు దూరం కాకూడదన్న లక్ష్యంతో 2010లో కేంద్ర ప్రభుత్వం ఈ చట్టాన్ని తెచ్చిందన్నారు. అలాగే ప్రైవేట్ పాఠశాలల్లో విద్యార్థుల నుంచి తీసుకునే ఫీజుల వివరాలతో సూచిక బోర్డులు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. పట్టణంలోని అన్ని పాఠశాలల్లో విద్యార్థులకు మౌలిక వసతులు ఎలా ఉన్నాయని ఎంఈఓ వెళ్లి పరిశీలించాలన్నారు. పాఠశాలలోనే నోటు పుస్తకాలు, పాఠ్య పుస్తకాలు కొనుగోలు చేయాలని చెప్పి అధిక ధరలకు విక్రయించడం దారుణమన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

లోకేష్ మాటలు దెయ్యాలు వేదాలు వల్లించినట్లుంది

బద్వేలు అర్బన్ : నీతిగా, నిజాయితీగా ప్రజల కోసం, నియోజకవర్గ అభివృద్ధి కోసం పనిచేస్తున్న తమపై యువగళం పాదయాత్రలో లోకేష్ చేసిన ఆరోపణలు నిరాధారమైనవని, లోకేష్ మాటలు దెయ్యాలు వేదాలు వల్లించినట్లుందని ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధలు తెలిపారు. గురువారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాలుగేళ్ళ కాలంలో బద్వేలు నియోజకవర్గంలో సుమారు రూ.1,056 కోట్ల మేర నిధులతో అభివృద్ధి పనులు జరిగడంతో పాటు రూ.2 వేల కోట్లతో గోపవరం సమీపంలో సెంచూరీ ప్యానల్ పరిశ్రమ ఏర్పాటు చేయడం జరిగిందని, అయితే లోకేష్ ఎవరో రాసి ఇచ్చిన స్క్రిప్టు ప్రకారం బద్వేలులో అభివృద్ధి నిల్ అని చెప్పడం ఆయన అవివేకానికి నిదర్శనమన్నారు. అంతేకాకుండా నియోజకవర్గంలో తమ పార్టీ నాయకులు భూ కబ్జాలకు పాల్పడ్డారని ఏవో సర్వే నెంబర్లు చదివి ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నాలు చేశారని, వాస్తవంగా భూకబ్జాలు, నకిలీ పట్టాల తయారీలో తెలుగుదేశం పార్టీ నాయకులే నిందితులుగా ఉన్నారన్న విషయం లోకేష్ తెలుసుకోవాలన్నారు. బద్వేలు మున్సిపాలిటీకి ముఖ్యమంత్రి రూ.130 కోట్లు మంజూరు చేయగా ఆ పనులు జరగకుండా టీడీపీ నాయకులే ఆటంకాలు సృష్టిస్తున్నారన్నారు. అధికారంలో ఉన్నప్పుడు బద్వేలు నియోజకవర్గానికి ఏం చేశామో చెప్పకుండా తమను, తమ పార్టీ నాయకులను విమర్శించడమే పనిగా పెట్టుకున్నారని మండిపడ్డారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్ రాజగోపాల్‌రెడ్డి, నియోజకవర్గ బూత్ కన్వీనర్ల సమన్వయకర్త కె.రమణారెడ్డిలు పాల్గొన్నారు.

19న క్రీడా పాఠశాల మండలస్థాయి ఎంపికలు

చింతకొమ్మదిన్నె : కడపలోని డాక్టర్ వైఎస్ఆర్ క్రీడా పాఠశాలలో 2023–24 విద్యా సంవత్సరానికి 4, 5 తరగతి ప్రవేశాల కోసం ఎంపిక ప్రక్రియ చేపడుతున్నట్లు మండల విద్యాధికారి వెంకట్రామిరెడ్డి తెలిపారు. గురువారం మండలంలోని ఎమ్మార్సీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 4వ తరగతిలో ప్రవేశానికి బాలురకు 20 సీట్లు, బాలికలకు 20 సీట్లకు ఎంపికలు నిర్వహిస్తారన్నారు. గతేడాది మిగిలిన 11 సీట్లకు గాను బాలికలకు, సీట్లు బాలురకు ఈ ఏడాది 5వ తరగతిలో ప్రవేశం కల్పిస్తామన్నారు. ఈ ఎంపికలు బయనపల్లె శ్రీవెంకటేశ్వర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ఉంటాయన్నారు. ఎంపికలో పాల్గొనే విద్యార్థులు 2014 ఆగస్టు 1 నుంచి 2015 జులై మధ్య పుట్టిన విద్యార్థులు ఉండాలన్నారు. 5వ తరగతిలో ప్రవేశాలు పొందే విద్యార్థులు 2013 ఆగస్టు 1 నుంచి జులై 31 మధ్యలో పుట్టిన వారు అర్హులన్నారు. మరిన్ని వివరాలకు 3866431633, 99087 83229 అనే నెంబర్లను సంప్రదించాలన్నారు.

సకాలంలో మట్టినమూనాల సేకరణ

ముద్దనూరు : ప్రస్తుత ఖరీఫ్ సాగులో సకాలంలో మట్టినమూనాలు సేకరించి వాటి వివరాలను నమోదు చేయాలని మండల వ్యవసాయాధికారి వెంకటకృష్ణారెడ్డి సూచించారు. గురువారం ఆయన రైతుభరోసా కేంద్రం సిబ్బందితో సమావేశం నిర్వహించి మాట్లాడారు.

పండ్ల తోటల పెంపకానికి దరఖాస్తు చేసుకోండి

కమలాపురం : జిల్లా నీటి యాజమాన్య సంస్థ–మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా పండ్లతోటల పెంపకానికి దరఖాస్తు చేసుకోవాలని ఏపీఓ అన్నా నాయక్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 5 ఏకరాలు, లేదా అంతకంటే తక్కువ భూమి కలిగిన రైతులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. మామిడి, చీనీ, సన్న నిమ్మ, జామ, సపోట, కొబ్బరి, సీతాఫలం, దానిమ్మ, నెరేడు, చింత, అంజీర, డ్రాగన్ ఫ్రూట్, ఆపిల్, బేరు, మునగ తదితర రకాల పండ్ల తోటల పెంపకానికి దరఖాస్తు చేసుకోవాలని, పూర్తి వివరాలకు ఉపాధి హామీ కార్యాలయంలో సంప్రదించాలని ఆయన తెలిపారు.

నేటి నుంచి రెండవ సెమిస్టర్ పరీక్షలు

వేంపల్లె : స్థానిక వైఎస్సార్ వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్శిటీ రెండవ సెమిస్టర్ పరీక్షలు శుక్రవారం నుంచి ప్రారంభం కానున్నాయని కళాశాల ప్రిన్సిపాల్ సి.యోగాంజనేయులు తెలిపారు. ఈ సందర్భంగా వేంపల్లెలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోఆర్డినేటర్ బాలకొండ గంగాధర మాట్లాడుతూ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్శిటీ విద్యార్థులకు రెండవ సెమిస్టర్ పరీక్షలు ఈనెల 16వ తేదీ నుండి 22వ తేదీ వరకు జరుగుతాయని.. పరీక్షా సమయం మధ్యాహ్నం 2గంటల నుంచి 5 గంటల వరకు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.

అనాథ వృద్ధులకు అన్నదానం

వేంపల్లె : స్థానిక పాత గండి రోడ్డులోని మదర్ థెరిస్సా చారిటబుల్ ట్రస్ట్ ఆశ్రమంలో అనాథ వృద్ధులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. గురువారం వేంపల్లె పట్టణానికి చెందిన ఓబుళరెడ్డి మునిరెడ్డి నాల్గవ వర్ధంతి సందర్భంగా భార్య లక్షుమ్మ అనాథ వృద్ధులకు అన్నదానంతోపాటు దుస్తులను పంపిణీ చేశారు. అనంతరం వారికి స్వీట్లు, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

17న కవి సమ్మేళనం

కడప కల్చరల్ : కడప నగరంలో ఈనెల 17న ఉర్దూ కవి సమ్మేళనం నిర్వహించనున్నారు. బజ్మే జావీద్ ఉర్దూ సాహితీ సంస్థ ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం 7 గంటలకు నగరంలోని కోటగడ్డవీధిలో గల షాహిర్ మంజిల్‌లో ఈ కవి సమ్మేళనం నిర్వహిస్తామని సంస్థ అధ్యక్షులు ప్రొఫెసర్ సత్తార్ సాహిర్ తెలిపారు.

ఈ కార్యక్రమానికి రాయచోటి ఉర్దూ డిగ్రీ మహిళా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ స య్యద్ హైదర్ అలీ అధ్యక్షత వహిస్తారన్నారు.

అర్హతగల ప్రతిఇంటికీ నవరత్నాలతో లబ్ధి



రామచంద్రాపురంలో ప్రజల సమస్యలను తెలుసుకుంటున్న ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి

పెండ్లిమర్రి : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన నవరత్నాల ద్వారా ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాల ద్వారా లబ్ధిచేకూరుతోందని ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. గురువారం గొందిపల్లె గ్రామ సచివాలయం పరిధిలోని రామచంద్రాపురం, ఇందిరానగర్, నల్లయ్యగారిపల్లె గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన ఇంటింటికీ వెళ్ళి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయ అని ప్రజలను అడిగి తెలుసుకున్నారు. కొందరు పక్కాగృహాలు, ఇంటి స్థలం లేదని, భూసమస్యలు, విద్యుత్ లైన్ల సమస్యలు ఉన్నాయని ఎమ్మెల్యే దృష్టికి తీసుకవచ్చారు. ఆయన వారి సమస్యలను పరిష్కరించాలని అధికారులను అదేశించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ చంద్రారెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి శివశంకర్‌రెడ్డి, వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు రమణారెడ్డి, అగ్రో కార్పోరేషన్ డైరెక్టర్ చావలి శివ, సర్పంచ్ భాస్కర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు రామాంజనేయరెడ్డి, ధనుంజయ రెడ్డి, రామగంగిరెడ్డి, రమణ, సిద్దారెడ్డి, నరసింహారెడ్డి, నిఖిల్‌రెడ్డి, ఎంపీడీవో జగన్‌మోహన్‌రెడ్డి, తహసీల్దార్ ఉదయ భాస్కర్‌రాజు, ఎస్ఐ సునీల్‌కుమార్ రెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు అధికారులు పాల్గొన్నారు.

గడప గడపలో సమస్యల పరిష్కారానికి కృషి



మహిళతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

ముద్దనూరు : గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో సమస్యల పరిష్కారం జరుగుతోందని ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి తెలిపారు. గురువారం మండలంలోని రాజులగురువాయిపల్లె గ్రామంలో మాజీ ఎంపీపీ మునిరాజారెడ్డితో కలిసి ఆయన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల్లోని ప్రతి సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్ళి పరిష్కారానికి కృషిచేస్తున్నామన్నారు. డ్రైనేజి సమస్యను పరిష్కరించాలని గ్రామస్తులు ఎమ్మెల్యేను కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు రాజుల శివశంకర్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, సుమంత్ తదితరులు పాల్గొన్నారు.

చెప్పిన హామీలను నేరవేరుస్తున్న ప్రభుత్వం

ఎర్రగుంట్ల : చెప్పిన హామీలను నెరవేర్చడంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముందుంటారని ఎమ్మెల్యే డాక్టర్ ఎం.సుధీర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో కాంట్రాక్టు ఉద్యోగస్తులను రెగ్యులైజ్ చేసిన శుభ సందర్భంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్ర పటానికి పాలాభిషేకం చేసి అనంతరం ఎమ్మెల్యేను సన్మానించారు. కాంట్రాక్టు ఉద్యోగులు మాట్లాడుతూ మమ్మల్ని రెగ్యులైజ్ చేసి మా జీవితాలలో మా కుటుంబాలలో వెలుగులు నింపిన మహానీయుడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని కొనియడారు.

నేడు చెవి, ముక్కు, గొంతు వైద్య నిపుణులు రాక

పులివెందుల : పట్టణంలోని భాకరాపురంలో ఉన్న దినేష్ మెడికల్ సెంటర్(ఇసీ గంగిరెడ్డి ఆసుపత్రి)లో శుక్రవారం ఉదయం చెవి, ముక్కు, గొంతు వ్యాధుల శస్త్ర చికిత్స వైద్య నిపుణులు డాక్టర్ వి.ప్రతాప్‌రెడ్డి చెవిలో చీము కారుట, చెవి నొప్పి, చెవిలో శబ్దములు, చెవిలో కర్ణభేరికి రంధ్రం, చెవిటి మిషన్లు అమర్చడం, చెవిలో బలపాలు, పూసలు తీయుట, ముక్కు దూలం సరిచేయుట, అలర్జీ, సైనుసైటిస్, ముక్కులో రక్తం కారుటకు, ముక్కులో బలపాలు, పూసలు తీయుట, ముక్కులో గడ్డలకు, ఎండోస్కోపి సైనస్ సర్జరీ, గొంతులో గడ్డలకు శస్త్ర చికిత్స, స్వర పేటికలో లోపాలకు చికిత్స, గొంతులో ఇరుక్కుపోయిన చేప ముల్లులు, నాణేలు తీయుట, గొంతులో ఇన్‌ఫెక్షన్‌కు మాటలు రానివారికి చికిత్స, తలనొప్పి, తల తిరుగుట చికిత్స, తదితర వాటికి వైద్య పరీక్షలు నిర్వహిస్తారు. అలాగే ఆసుపత్రిలో 24 గంటలు ఎండోస్కోపీ, కోలనోస్కోపీ పరీక్షలతోపాటు గ్యాస్ట్రబుల్ తీవ్రత తెలుసుకోవడం, చిన్నపిల్లలు నాణేలు, పిన్నులు, సూదులు, ముక్కలు మింగితే తీయడం జరుగుతుందని.. ఎసోఫజిల్ వెరిసెస్‌కు ఎండోస్కోనిక్ బాండిన చేస్తామన్నారు. ఈ అవకాశాన్ని పులివెందుల ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు 08568 286189, 9963170177 ఫోన్ నెంబర్లకు సంప్రదించాలన్నారు.

విద్యాభివృద్ధికే జగనన్న ఆణిముత్యాలు

– పాడా ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డి



జగనన్న ఆణిముత్యాలకు ఎంపికైన విద్యార్థులతో ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డి

పులివెందుల టౌన్ : రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులను ప్రోత్సహించేందుకే జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని పాడా ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డి తెలిపారు. గురువారం పట్టణంలోని అహోబిలాపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎంఈఓ బండి వీరారెడ్డి అధ్యక్షతన జగనన్న ఆణిముత్యాల కార్యక్రమంలో ఓఎస్డీ పాల్గొని తల్లిదండ్రులను సత్కరించి ప్రోత్సాహకాలను అందించి మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలలో చదివి టాప్ మార్కులు సాధించిన ప్రతిభావంతులకు సీఎం జగన్ ప్రభుత్వం ప్రోత్సాహకాలు ఇచ్చి విద్యార్థులలో ఉత్తేజం నింపుతోందన్నారు. ప్రభుత్వం నాడు–నేడుతో పాఠశాలల రూపురేఖలు మారిపోయాయన్నారు. 8వ తరగతి నుంచే ట్యాబ్‌లు అందించడం సాంకేతికంగా కార్పొరేట్ పాఠశాలల కంటే పైచేయి సాధించేలా ప్రభుత్వం విద్యార్థులకు వసతులు, సౌకర్యాలు సమకూర్చారన్నారు. ఒకప్పుడు ప్రైవేట్ పాఠశాలల్లో సీటు కోసం సిఫార్సులు చేసేవారని.. కానీ ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలల సీట్ల కోసం సిఫార్సులు చేయాల్సిన పరిస్థితి వరకు వెళ్లిందని.. ఈ ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. నియోజకవర్గస్థాయిలో టెన్త్‌లో నలుగురు, ఇంటర్‌లో నలుగురు విద్యార్థులు ఎంపికయ్యారన్నారు. కార్యక్రమంలో సివిల్ సప్లయ్ రాష్ట్ర డైరెక్టర్ హాలు గంగాధరరెడ్డి, మార్కెట్ యార్డు చైర్మన్ చిన్నప్ప, మున్సిపల్ వైస్ చైర్మన్ హఫీజ్, కౌన్సిలర్ పార్నపల్లె కిశోర్, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వైఎస్సార్ పశు బీమాపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న పశుసంవర్థక శాఖ డీడీ నారయ్య

తొండూరు : మండల పరిధిలోని కోరవానిపల్లె గ్రామంలో గురువారం పశుసంవర్థక శాఖ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ జె.నారయ్య ఆధ్వర్యంలో ప్రజలకు వైఎస్సార్ బీమా పథకంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.15వేలు విలువ చేసే పశువుకు మూడేళ్ల బీమా కొరకు రూ.192లు, రూ.30 వేలు విలువ చేసే పశువుకు మూడేళ్లకు రూ.384లు, గొర్రెలు, మేకలకు మూడేళ్లకు రూ.75లు బీమా చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఏవైనా సందేహాలుంటే మీ దగ్గరలోని రైతు భరోసా కేంద్రంలో కానీ, పశువుల ఆసుపత్రులలోని పశు వైద్య సిబ్బందిని కానీ సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో లైవ్ స్టాక్ అసిస్టెంట్ ఖాదర్‌బాబు, పశు పోషకులు పాల్గొన్నారు.

ఉత్తమ ఆర్టీసీ ఉద్యోగులకు సన్మానం



ఉత్తమ ఉద్యోగులను సత్కరిస్తున్న ఈడీ వెంకటేశ్వరరావు

పులివెందుల రూరల్ : పట్టణంలోని ముద్దనూరు రోడ్డులో నూతనంగా నిర్మించిన ఆర్టీసీ బస్టాండును గురువారం ఆర్టీసీ సంస్థ ఈడీ వెంకటేశ్వరరావు పరిశీలించారు. డిపోలో ఉత్తమ ఆర్టీసీ ఉద్యోగులకు అభినందన సమావేశం నిర్వహించారు. వివిధ శిక్షణలో నైపుణ్యం సాధించని డ్రైవర్లను, కండక్టర్లను, డీజిల్ సేవింగ్ సిబ్బందిని, స్పెషల్ టైపులో ఉత్తమ సేవలు అందించిన కొండాయపల్లె వెలుగులో పి.వి.జి.నాథ్, వైవీఎస్‌రెడ్డి, ఈశ్వరయ్య, ఎస్టీఎం బాషా, ఈశ్వరయ్య, ఎంజీరెడ్డి, ఎస్ఎం షరీఫ్‌లతోపాటు వివిధ సెక్షన్లలో ఉత్తమ ఉద్యోగులను సన్మానించారు. కష్టపడి పనిచేసి ఆర్టీసీని లాభాల బాటలో నడిపించే విధంగా చూడాలన్నారు. కార్యక్రమంలో డీపీటీవో గోపాల్‌రెడ్డి, సీఎంఈ భాస్కర్, ఎంవీఐ ప్రసాద్, ఈఈ రమణ, బియ్యం ఉమామహేశ్వరరావు, సూపర్‌వైజర్లు, డిపో ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి గురించి జాగ్రత్తగా మాట్లాడాలి

కడప కల్చరల్ : రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గురించి మాట్లాడే సమయంలో తగిన జాగ్రత్త వహించాలని గ్రేటర్ రాయలసీమ బలిజ సంఘం అధ్యక్షులు చెన్నంశెట్టి మురళీకృష్ణ తెలిపారు. ఇటీవల కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా, బీజేపీ అధ్యక్షులు నడ్డా రాష్ట్రానికి వచ్చినపుడు పని గట్టుకుని ఎవరో రాసిచ్చిన స్క్రిప్టును చదివినట్లుగా పసలేని విమర్శలు గుప్పించారని, ఇక్కడి ప్రతిపక్షాలు కూడా ఆ విమర్శలను చూసి నవ్వుకుంటున్నాయని తెలిపారు. దేశంలో ఏ రాష్ట్ర ముఖ్యమంత్రి అమలు చేయనన్ని సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న ఏకైక యువ ముఖ్యమంత్రిగా సంపూర్ణంగా ప్రజల కోసమే ప్రభుత్వం అన్న రీతిలో పాలిస్తున్నారన్నారు. పలువురు కేంద్ర మంత్రులు సైతం ప్రశంసించిన విషయం వారికి కూడా తెలుసన్నారు. కానీ రాష్ట్రంలోని కొన్ని రాజకీయ శక్తులను సంతోష పరిచేందుకు వారు అలా రాసిచ్చిన స్క్రిప్టును చదివారన్నారు. నిజానికి వారికి కూడా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన గురించి బాగా తెలుసని, వారు మనస్ఫూర్తిగా ఈ విమర్శలు చేసినట్లుగా కనిపించడం లేదని ఆయన అన్నారు.